సాక్షి ప్రకాశం

శనివారం | 28 | జనవరి | 2023



పశ్చిమ ప్రాంతంలో ఎన్ఆర్సీ మంజూరు చేయాలి

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన న్యూట్రిషన్ రీహ్యాబిలిటేషన్ సెంటర్‌ను పశ్చిమ ప్రకాశంలో మంజూరు చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సీఎస్‌ను కోరారు. - 8లో..

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొని క్లీనర్ మృతిచెందిన సంఘటన కంభం ఫ్లై ఓవర్‌పై శుక్రవారం జరిగింది. హైదరాబాద్ నుంచి గిద్దలూరు వస్తున్న గిరిధర్ ట్రావెల్స్ బస్సు ముందువైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. బస్సులో ముందువైపు కూర్చుని ఉన్న క్లీనర్.. క్యాబిన్‌లో ఇరుక్కుపోయి మృతిచెందాడు. బస్సులోని ఏడుగురు ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30 /21

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

108లో ఈఎంటీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: అత్యవసర వైద్యసేవలైన 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు తగిన విద్యార్హత సర్టిఫికెట్ల (ఒరిజినల్, జెరాక్స్ కాపీలు)తో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో వైఎస్సార్ జిల్లా కేంద్రమైన కడప నగరంలోని నాగార్జునపేటలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గల నిహార్ స్కిల్ సెంటర్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. బీఎస్సీ లైఫ్ సైన్స్, ఎంఎల్‌టీ, జీఎన్ఎం విద్యార్హత ఉన్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని చెప్పారు. పూర్తి వివరాలకు 79012 43559, 79012 42018 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

- ఉపాధ్యాయులతో డీఈవో విజయభాస్కర్



సమీక్షిస్తున్న డీఈవో విజయభాస్కర్

ఒంగోలు: ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తిచేయాలని, పదో తరగతి విద్యార్థులకు సక్రమంగా స్టడీ అవర్స్ నిర్వహించాలని డీఈవో బి.విజయభాస్కర్ ఆదేశించారు. స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, టీచర్ డైరీలు, విద్యార్థుల నోట్సుల కరెక్షన్స్‌ను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. శనివారం నాటికి వంద శాతం యుడైస్ పూర్తిచేయాలన్నారు. నాడు–నేడు పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలని, బ్యాలెన్స్ అమౌంట్‌ను విధిగా ఖర్చుచేయాలని సూచించారు. అకడమిక్ మానిటరింగ్ టీమ్స్ విధిగా తమకు కేటాయించిన పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బోధన, అభ్యసనపై మార్గదర్శకత్వం వహించాలన్నారు. ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు టూర్ ప్రోగ్రామ్ ఖరారు చేసుకుని ముందు రోజు డీఈవో కార్యాలయానికి తెలియజేయాలన్నారు. సమ్మేటివ్–1 పరీక్షకు సంబంధించిన మార్కులను అన్ని పాఠశాలల యాజమాన్యాలతో శనివారంలోపు అప్‌లోడ్ చేయించాలని తెలిపారు.

పీఎఫ్ సమస్యల పరిష్కారంలో మరో ముందడుగు

- ఈపీఎఫ్‌వో అసిస్టెంట్ కమిషనర్ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న ఈపీఎఫ్‌వో అసిస్టెంట్ కమిషనర్ సతీష్‌కుమార్

ఒంగోలు: ఉద్యోగుల భవిష్యనిధికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో మరో ముందడుగుకు నిధి ఆప్‌కే నిఖత్ (మీ ముందుకే పీఎఫ్) కార్యక్రమం ఉపయోగపడుతోందని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఒంగోలు సహాయ కమిషనర్ బీటీ సతీష్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. పీఎఫ్‌కు సంబంధించిన ఉద్యోగులు, యాజమాన్యాలు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగానే 2015లో భవిష్య నిధి దాలత్, 2021లో మంత్లీ పెన్షన్ అదాలత్, 2023లో నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమాలను ప్రారంభించినట్లు వివరించారు. నూతన కార్యక్రమం ద్వారా పీఎఫ్ చెల్లించే యాజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లకు అవగాహన కల్పించడంతో పాటు అదే రోజు వారి సమస్యలు కూడా తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా పీఎఫ్‌కు సంబంధించి సమస్యలుంటే స్థానిక రాంనగర్ 12వ లైనులోని తమ కార్యాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. పీడీసీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.రాఘవయ్య, కార్మికశాఖ సహాయ కమిషనర్ కె.పవన్‌కుమార్, బి.అనితావాణి, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ జిల్లా నోడల్ అధికారి ఎం.సమ్మయ్య, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సహాయ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎం.సుధీర్ బాబు, ఆప్కాబ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బి.రాంబాబు నాయక్, పీడీసీసీబీ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాణం పదిలం

సత్ఫలితాలిస్తున్న నో యాక్సిడెంట్ డే

ఒక వ్యక్తి ప్రాణం కోల్పోతే ఆ కుటుంబం పడే బాధ వర్ణనాతీతం. రోడ్డు ప్రమాదాల్లో అకస్మాత్తుగా ఎవరైనా మరణిస్తే వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు గుండె కోతే. జిల్లాలో అటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించి వాహనదారులను అప్రమత్తం చేస్తోంది. ఒకవేళ ప్రమాదాలు జరిగినా ప్రాణ నష్టం సంభవించకుండా హెల్మెట్, సీట్ బెల్ట్‌ల వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లా ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేక దృష్టి సారించి 'నో యాక్సిడెంట్ డే' పేరుతో ప్రతి శనివారం చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ సత్ఫలితాలిస్తోంది.

- తగ్గుతున్న రోడ్డు ప్రమాదాలు
- ప్రాణ రక్షణకు హెల్మెట్, సీట్ బెల్ట్‌పై నిరంతరం అవగాహన
- హెల్మెట్ లేకనే 60 శాతం మరణాలు
- హైవేలపై నిరంతర నిఘా
- హెల్మెట్ ధరించకపోతే జరిమానా



ప్రమాదాలపై డెమో ఇప్పిస్తున్న ఎస్పీ మలికాగర్గ్ (ఫైల్)


ఒంగోలు టౌన్: జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 60 శాతం మరణాలు ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారివే అని పోలీస్ శాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో ఎస్పీ మలికా గర్గ్ అనేక చర్యలు చేపట్టారు. గతేడాది కొంతమేరకు ఫలితాలు కూడా సాధించారు. అందుకు ఈ గణాంకాలే నిదర్శంగా నిలుస్తున్నాయి. 2021తో పోల్చుకుంటే 2022వ సంవత్సరంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. మరణాల సంఖ్య 20 శాతం మేర తగ్గడం, క్షతగాత్రుల సంఖ్య సైతం 10 శాతం తగ్గడం గమనార్హం. 2021లో మొత్తం ప్రమాదాలు 1,014 జరిగాయి. వాటిలో 468 మంది మరణించగా, 1,110 మంది గాయపడ్డారు. 2022లో 886 ప్రమాదాలు జరగ్గా, 376 మంది మృతి చెందారు. వీరిలో సుమారు 200 మంది వరకు హెల్మెట్ లేకపోవడంతో మరణించినవారే ఉన్నారు. 1,004 మంది గాయపడ్డారు. 2023లో కొత్త ప్రణాళిక సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు.



పోలీసులు ఏర్పాటు చేసిన బ్లాక్ స్పాట్ బోర్డులు (ఫైల్)

తలకిందులైన కుటుంబాలు...

గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మరణించిన 376 కుటుంబాల పరిస్థితి దయనీయంగా తయారైంది. తండ్రిని కోల్పోయిన బిడ్డలు, భర్తను పోగొట్టుకుని ఒంటరివారైన మహిళలు ఎందరో. క్షతగాత్రులైన 1004 మంది కుటుంబాల దుస్థితి వర్ణణాతీతం. కుటుంబపోషణను భుజస్కందాల మీద మోసే ఇంటిపెద్ద కాలో, చేయో పోగొట్టుకుని ఇంటికే పరిమితం కావడం, చేతికి అందివచ్చిన బిడ్డ గాయాలపాలై మంచాన పడితే చికిత్స చేయించడానికి అప్పులు చేసి అవి తీర్చడానికి రెక్కలు ముక్కలు చేసుకోవాల్సి రావడం వంటివి ఆయా కుటుంబాలను ఆవేదనకు గురిచేస్తున్నాయి. అందుకే ప్రభుత్వం జీరో యాక్సిడెంట్స్, జీరో మరణాల కోసం అనేక చర్యలు చేపడుతోంది. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా వాహన వినియోగం పెరుగుతోంది.



ప్రస్తుతం జిల్లాలో మొత్తం 8.5 లక్షలు వివిధ రకాల వాహనాలు ఉన్నాయి. అందులో ద్విచక్ర వాహనాలు సుమారు 6.5 లక్షలు ఉన్నట్టు అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వలన అనేకమంది ప్రమాదాల బారిన పడుతున్నారు. విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

డెమో ప్రదర్శనల ద్వారా చైతన్యం...

ప్రమాదాలు జరిగినప్పుడు బాధితుల మానసిక, భౌతిక పరిస్థితిని, బాధిత కుటుంబాల ఆందోళన, ఆవేదనను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా వినూత్న తరహాలో డెమో ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. గత సెప్టెంబర్‌లో ఒంగోలు నగరంలోని ముంగమూరు రోడ్డు జంక్షన్, వెంగముక్కలపాలెం జంక్షన్లలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారితో డెమో ప్రదర్శన ఇప్పించారు. కాళ్లు, చేతులు, తలకు గాయాలైనట్లు కట్లు కట్టుకుని రోదిస్తున్న వారిని చూసి నిజమని పలువురు ప్రజలు భావించారు. అసలు విషయం తెలుసుకుని ఆలోచనలో పడ్డారు. అలాగే సదరు పాత్రదారుల సెల్ఫీలను వారి కుటుంబ సభ్యులకు పంపించారు. అప్పుడు కుటుంబ సభ్యులు పడిన ఆందోళనను వాహన చోదకులు స్వయంగా అనుభవించేలా చేయడం ద్వారా వారిలో రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకునేలా చైతన్యం కల్పించారు.

టోల్ గేట్ల వద్ద నిరంతర నిఘా...

ఎక్కువగా హెల్మెట్ ధరించకపోవడం వలనే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ మలికాగర్గ్ హైవేలపై ఉన్న టోల్ గేట్ల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలోలా ఒకటిరెండు రోజుల పాటు ఏదో హడావిడి చేయకుండా 24 గంటలూ నిఘా ఉంచడం ద్వారా ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చేయాలని భావిస్తున్నారు. తద్వారా ఒకవేళ ప్రమాదం జరిగినా ప్రాణనష్టం జరగకుండా చూడాలని ప్రయత్నిస్తున్నారు. ఇందుకు గానూ హెల్మెట్ ధరించకుండా ప్రయాణాలు చేసే వారికి జరిమానా విధించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

ప్రజల భద్రత కోసమే : ఎస్పీ మలికాగర్గ్

హెల్మెట్ ధరించడం అనేది ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉంది. తక్కువ ధరకు వస్తుందని నాసిరకం హెల్మెట్లు కొనవద్దు. నాణ్యమైన హెల్మెట్లు ధరించడం, వాటిని సరిగ్గా ధరించడం అవసరం. దీని వల్ల దురదృష్టవశాత్తూ ప్రమాదాలు జరిగినా ప్రాణాలు దక్కుతాయి. జరిమానాల కోసం పోలీసులు తనిఖీ చేయరు. ప్రజల ప్రాణాలు రక్షించేందుకే ప్రయతిస్తారు. వాహనచోదకులు ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలి. రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలి.

■ ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డే...

జిల్లా వ్యాప్తంగా ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డే కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో వాహనచోదకులకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా వారిని కోర్టులో హాజరు పరిచి ఒకరోజు జైలు శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది 3,498 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 1,484 మందికి శిక్షలు విధించారు. వీరిలో 155 మందికి ఒకరోజు జైలు శిక్షతోపాటు రూ.34,55,300 జరిమానా విధించారు. మూడు లక్షల మందికిపైగా వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. అయితే, కేవలం కేసులు, జరిమానాలకే పరిమితం కాకుండా రోడ్డు మూలమలుపుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు తొలగించి సోలార్ బ్లింకర్లు ఏర్పాటు చేయడంతో పాటుగా హైవేలపై ఆక్రమణలు తొలగించారు. జిల్లా వ్యాప్తంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్న 37 ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి అక్కడ ప్రమాదాలు జరగకుండా అనేక చర్యలు తీసుకున్నారు.



ముళ్లచెట్లు తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

అప్పులు చేసి మరీ దోచుకున్నారు



సదస్సులో మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మేయర్ గంగాడ సుజాత

- టీడీపీ హయాంలో నీరు–చెట్టు పేరుతో నిలువుదోపిడీ చేశారు
- ఆ పార్టీ నేతలు అవినీతికి పాల్పడేందుకే చంద్రబాబు పథకాలు పెట్టారు
- అంతకుమించి ప్రజలకు చేసిందేమీ లేదు
- చివర్లో పసుపు–కుంకుమ ఇస్తే జనాలు నమ్ముతారా..?
- అమ్మ ఒడి, విద్యా దీవెన, నాడు–నేడు, ఆసరా వంటి పథకాలేమైనా ఇచ్చారా..?
- సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాల పేర్లు చెప్పాలంటేనే 10 నిమిషాలకుపైగా పడుతుంది
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: టీడీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అప్పులు చేసి మరీ ఆ పార్టీ నేతలు, చంద్రబాబు దోచుకున్నారని, ప్రజలకు చేసిందేమీ లేదని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విమర్శించారు. పేదలకు ఏ ఒక్క పథకమైనా చంద్రబాబు అమలు చేశాడా అని నిలదీశారు. రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ బాలినేని ప్రశ్నల వర్షం కురిపించారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధితో పాటు సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని పేర్నమిట్ట గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బాలినేని ముఖ్య అతిథిగా హాజరవగా, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. పేర్నమిట్ట హైవే సెంటర్ నుంచి శాంతినగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో బాలినేని మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రజలకు జరిగిన నష్టాలను వివరించారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి ప్రజలకు మొండిచెయ్యి చూపించిన చంద్రబాబు.. ఏకంగా ఆ పార్టీ నాయకుల కోసం నీరు–చెట్టు లాంటి పథకాన్ని అమలు చేసి దోచిపెట్టాడని విమర్శించారు. టీడీపీ హయాంలో అమ్మ ఒడి, విద్యా దీవెన, నాడు–నేడు, ఆసరా, చేయూత వంటి పథకాలేమైనా ఇచ్చారా అని నిలదీశారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పేర్లు చెప్పాలంటేనే 10 నిమిషాలకుపైగా సమయం పడుతుందన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు ప్రజలను చంద్రబాబు పట్టించుకోకుండా ఎన్నికల సమయంలో పసుపు–కుంకుమ ఇస్తే జనాలు ఏ విధంగా నమ్ముతారని బాలినేని నిలదీశారు. ఒంగోలు నియోజకవర్గానికి టీడీపీ నాయకులు ఏం చేశారో చెప్పాలని, ఒంగోలు మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చింది తానేనని బాలినేని గుర్తు చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గం అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని, అందుకే పేర్నమిట్టకు ప్రకాశం యూనివర్శిటీని తీసుకొచ్చామని అన్నారు. యూనివర్శిటీ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. పేర్నమిట్టలోని నిరుపేదలకు పేర్నమిట్టలోనే ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 3 వేల మంది వరకు పట్టాలివ్వాల్సి ఉందని బాలినేని పేర్కొన్నారు.

ఒంటరిగా పోటీ చేసేందుకు భయపడుతున్నారు : సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్

సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఒంటరిగా పోటీచేసేందుకు టీడీపీ భయపడుతోందని, కలిసికట్టుగా పోటీచేయాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ ఆశీసులతో తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఆ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డితో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌ను టార్గెట్ చేసి మాట్లాడుతున్న టీడీపీ నాయకులు.. జిల్లాలో వాసన్నను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని, ఆ అర్హత వారికి లేదని అన్నారు. బ్యాంకులను దోచుకున్న ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్.. వైఎస్సార్ సీపీ నాయకుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని టీజేఆర్ హెచ్చరించారు. ప్రజాభిమానం చూరగొన్న బాలినేని గురించి ఒక్క మాట మాట్లాడితే వంద మాట్లాడతామని టీడీపీ నాయకులను హెచ్చరించారు.

గడపగడపకు తిరిగిన బాలినేని, టీజేఆర్...

పేర్నమిట్టలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు శాంతినగర్‌లో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరు గురించి స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రశ్నించి ప్రజల నుంచి సమాధానాలు రాబట్టారు. ప్రతి ఇంటికి ఇచ్చిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించి పథకాల లబ్ధిని బాలినేని చదివి వినిపించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు స్థానిక సమస్యలను బాలినేని దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, మెప్మా పీడీ తేళ్ల రవికుమార్, సీఎంఎం డీసీహెచ్ కొండయ్య, కార్పొరేటర్లు కండె స్వాతి, గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, వెన్నపూస కుమారి, గుట్టపల్లి మస్తానమ్మ, పార్టీ నాయకులు కఠారి శంకర్, కత్తినేని మహాలక్ష్మి, భాస్కరరెడ్డి, వర్షు శేషయ్య, నూకతోటి ఈశ్వర్, చంద్రశేఖర్, చిరంజీవి, వెంకాయమ్మ, సాయి, కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, వేమా శ్రీనివాసరావు, రమణయ్య, గోలి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



పేర్నమిట్టలో గడపగడపకు తిరుగుతున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్

భక్తులతో మర్యాదగా మెలగండి



మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- పాద యాత్రికులకు కనీస సౌకర్యాలు కల్పించండి
- శివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సురేష్ సమీక్ష
- దేవస్థానం అధికారుల గైర్హాజరుపై అసహనం

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం వెళ్లే భక్తులతో మర్యాదగా మెలగాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులకు సూచించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణపై డిప్యూటీ కలెక్టర్ సేతు మాధవన్ అధ్యక్షతన శుక్రవారం పెద్దదోర్నాలలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి మంత్రి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు శ్రీశైలంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భారీగా తరలివెళ్లే యాత్రికులు, భక్తులు, శివస్వాములకు పెద్దదోర్నాల మండల కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ విషయంలో అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండ్ కోసం కేటాయించిన ఎకరా 40 సెంట్ల స్థలంలోనే బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరచడం, తాగునీటి వసతి, వైద్య శిబిరాలతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఘాట్‌రోడ్డులో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. మలుపుల వద్ద ప్రమాదాలకు సంబంధించిన హెచ్చరిక బోర్డులు, కార్నర్ మిర్రర్‌లు ఏర్పాటు చేయడంతో పాటు స్పీడ్‌బ్రేకర్లపై మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎటువంటి అరాచకాలు, అకృత్యాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎస్ఈబీ అధికారులు వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేసిన అనంతరమే ఘాట్‌రోడ్డులోకి అనుమతించాలన్నారు. ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రయాణికులకు అసౌకర్యం, స్థానిక వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హోటళ్లు, కూల్‌డ్రింక్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, తదితర వ్యాపార వర్గాలతో చర్చించి యాత్రికులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు అందుబాటులో ఉండాలని సూచించారు.

సీఐ మారుతీకృష్ణ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పెద్దదోర్నాలలో 200 మంది సిబ్బందితో నిరంతర గస్తీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మరికొన్ని మొబైల్ టీంలతో ఘాట్ రోడ్లలో గస్తీ నిర్వహిస్తామని తెలిపారు. ఘాట్‌రోడ్డులో ఏవైనా వాహనాలు మరమ్మతులకు గురై నిలిచిపోతే ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తొలగించేందుకు ప్రత్యేకంగా క్రేన్‌లు, రికవరీ వాహనాలను ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి మోహనరావు మాట్లాడుతూ పెద్దదోర్నాలలో పారిశుధ్య పనులకు 25 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఐదు ప్రాంతాల్లో మినరల్ వాటర్ చలివేంద్రాలు, వాహనాలు నిలిపే ప్రాంతాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రత్యేకమైన లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసరావు మాట్లాడుతూ కొర్రపోలు, చింతల వైద్యశాలలో 24 గంటలు వైద్యసేవలందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఘాట్‌రోడ్డులో రెండు 104 వాహనాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీధర్ నర్సింహులు మాట్లాడుతూ మార్కాపురం డిపో నుంచి యాత్రికుల సౌకర్యార్థం 100 బస్సులను శ్రీశైలంకు నడపనున్నట్లు తెలిపారు. పెద్దదోర్నాలలో 4 బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. శ్రీశైల దేవస్థానం అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి విశ్వేశ్వరరావు, పెద్దదోర్నాల ఎంపీపీ పద్మజ, జెడ్పీటీసీ లతాబాయి, మేజర్ పంచాయతీ సర్పంచ్ హారిక, నేషనల్ హైవే ఈఈ ఇందిర, ఎంవీఐ మాధవరావు, సెబ్ సీఐ రాగమయి, తహసీల్దార్ వేణుగోపాలరావు ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ బ్రమరాంబాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వింత దూడలు జననం..మృతి



జన్మించిన వింత దూడలు

తాళ్లూరు: మండలంలోని విఠలాపురం గ్రామానికి చెందిన పాడి రైతు శివరామక్రిష్ణకు చెందిన గేదెకు శుక్రవారం రెండు వింత దూడలు ఒక్కదానికొకటి అతుక్కొని జన్మించాయి. గేదె ఈనే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రైతు పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన సూచనలో పీఎహెచ్‌ఏ మార్టిల్ లూథర్, ఆరోగ్యమిత్ర ఆదినారాయణ తగిన వైద్య సహాయంతో రెండు వింత శిశువులు జన్మించాయి. అయితే కొంత సమయం తర్వాత అవి మృతి చెందాయి. అయితే గేదె మాత్రం సురక్షితం కావటంతో రైతు ఊపిరి పీల్చుకున్నాడు.

బాలుడిని దత్తత తీసుకున్న అమెరికా దంపతులు



అమెరికా దంపతులకు దత్తత ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్

- దత్తత ధ్రువీకరణ పత్రం అందచేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఒంగోలులోని సరా ఎన్‌జీఓ హోమ్‌లో ఉన్న 8 ఏళ్ల ధనుష్ అనే బాలుడిని అమెరికాకు చెందిన మేరి హాల్, డోనాల్డ్ హాల్‌లు దత్తత తీసుకున్నారు. శుక్రవారం దత్తత తీసుకున్న బాలుడిని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా దత్తత ధృవీకరణ పత్రాన్ని అందచేశారు. దత్తత తీసుకున్న బాలుడికి శరీరంలోని సగభాగం పార్షియల్ పెరాలసిస్ జన్మించినప్పటి నుంచి ఉండటంతో చికిత్సతో క్రమంగా కోలుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆ బాలుడిని అమెరికా దంపతులు దత్తత తీసుకున్నారు. త్వరలో హోంను విజిట్ చేస్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, డీసీపీఓ దినేష్ కుమార్, సరా హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు సక్రమంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎన్‌ఎల్‌ఎం ప్రిన్సిపల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్

- ఎన్‌ఎల్‌ఎం ప్రిన్సిపల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రీనివాస్

ఒంగోలు అర్బన్: నేషనల్ లెవల్ మానిటరింగ్ స్కీమ్ (ఎన్‌ఎల్‌ఎం) కింద జిల్లాలో ఎంఓఆర్‌డీ ద్వారా అమలవుతున్న 12 రకాల పథకాలను సక్రమంగా అమలు చేయాలని ఎన్‌ఎల్‌ఎం ప్రిన్సిపల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అంబటి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ప్రకాశంభవనంలో శుక్రవారం సంబంధిత పథకాల అమలుపై డీఆర్‌ఓ ఓబులేసు సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఆర్‌ఓ మాట్లాడుతూ పథకాల అమలుకు సంబంధించి ఈ నెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నాలుగు మండలాల్లోని పది గ్రామాల్లో అమలవుతున్న కార్యక్రమాలను తనిఖీ చేస్తారన్నారు. హెచ్‌ఎంపాడు, వై పాలెం, త్రిపురాంతకం, కొమరోలు మండలాల్లోని పది గ్రామాలు పర్యటన ఉంటుందని, అన్నీ పరిశీలించి నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందచేస్తారని తెలిపారు. అధికారులు పథకాల అమలుపై పూర్తి స్పష్టతతో ఉండాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీ, డ్వామా, హౌసింగ్ పీడీలు, డీపీఓ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

భైరవకోనలో జిల్లా జడ్జి పూజలు



భైరవకోన ఆలయాల్లో పూజలు చేస్తున్న జిల్లా జడ్జి భారతి

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో జిల్లా జడ్జి ఏ భారతి శుక్రవారం పూజలు చేశారు. జడ్జి కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం భైరవకోనకు వచ్చారు. కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భరత్ చంద్ర కూడా భైరవకోనకు విచ్చేశారు. అక్కడి జలపాతాన్ని సందర్శించి త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ పూజారులు కంబాలదిన్నె వెంకటనర్సయ్య, పంచాగ్నుల రామమూర్తి శర్మ, సుధాకర్ శర్మలు జడ్జిలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయాల్లో పూజలు చేశారు. పూజల అనంతరం వారిని శేష వస్త్రాలతో సన్మానించి స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- క్లీనర్ మృతి



బస్సు క్యాబిన్‌లో నుంచి మృతదేహాన్ని తీస్తున్న స్థానికులు



మృతుడు సుబ్బయ్య (ఫైల్)

కంభం: ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామును స్థానిక ఫ్లెఓవర్‌పై జరిగింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి గిద్దలూరు వస్తున్న గిరిధర్ ట్రావెల్స్ బస్సు ఉదయం ఐదు గంటల సమయంలో ఫ్లెఓవర్ మీదకు రాగానే ముందు వెళ్తున్న లారీని వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రావెల్ బస్సులో ముందు సీటులో కూర్చొని ఉన్న క్లీనర్ జన్నవోగు సుబ్బయ్య(20) క్యాబిన్‌లో ఇరుక్కొని మృతి చెందాడు. మృతుడు మార్కాపురం మండలం చింతకుంట్ల గ్రామ వాసి. మృతదేహాన్ని క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తెల్లవారుజామున మంచు వల్ల ముందు వెళ్తున్న వాహనం సరిగ్గా కనిపించక ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. లారీ భీమవరం నుంచి మట్టి లోడుతో ప్రొద్దుటూరుకు వెళుతున్నట్లు డ్రైవర్ తెలిపాడు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఏడుగురు ప్రయాణికులు మాత్రమే ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. సంఘటనా స్థలాన్ని సీఐ ఎం రాజేష్, ఎస్సై నాగ మల్లేశ్వరరావు పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

- పోలీసులు కొడతారేమోనన్న భయంతోనే ఆత్మహత్య?
- దొంగతనం కేసులో విచారణకు పిలిచిన పోలీసులు
- విచారణ చేపట్టిన దిశ డీఎస్పీ



కాకర్లలో విచారణ చేస్తున్న దిశ డీఎస్పీ



మృతి చెందిన మండ్లా లక్ష్మయ్య

అర్ధవీడు(కంభం): పోలీసులు కొడతారేమోనన్న భయంతో గురువారం వ్యాజ్‌మోల్ తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..మండలంలోని కాకర్లలో వారం రోజుల క్రితం గన్నా చిన్నకోటయ్య నివాసంలో దొంగతనం జరిగి 4 తులాల బంగారు నగలు అపహరించుకెళ్లిన విషయం విదితమే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అర్ధవీడు పోలీసులు గ్రామానికి చెందిన మండ్లా లక్ష్మయ్యను విచారణ నిమిత్తం పిలివగా మనస్తాపానికి గురై వ్యాజ్‌మోలా ద్రావణం తాగడంతో కుటుంబసభ్యులు కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు అనంతరం ఒంగోలు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పోలీసులు కొడతారన్న భయంతోనే..

పోలీసులు కొడతారన్న భయంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. విచారణ కోసం పిలిచేందుకు గ్రామానికి వచ్చిన కానిస్టేబుల్ లక్ష్మయ్యపై చేయి చేసుకున్నాడని మృతుడి బంధువులతో పాటు స్థానికులు చెబుతున్నారు. స్టేషన్‌కు వెళ్తే మరలా కొడతారన్న భయంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బంధువులు, స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు ఒంగోలు దిశ డీఎస్పీ ఎ. పల్లపురాజు, కంభం సీఐ ఎం రాజేష్‌తో కలసి కాకర్ల, అర్ధవీడు గ్రామాలకు వెళ్లి విచారణ చేశారు. స్థానికులు, బంధువులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. పూర్తి నివేదికను ఎస్పీకి అందజేస్తామని తెలిపారు.

పశ్చిమ ప్రాంతంలో ఎన్‌ఆర్‌సీ మంజూరు చేయాలి

- సీఎస్‌ను కోరిన కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు అవసరమైన ఎన్‌ఆర్‌సీ (న్యూట్రిషన్ రీహ్యాబిటేషన్ సెంటర్)ను జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో మంజూరు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం సాయంత్రం సీఎస్ జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేసి నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణలు ఇచ్చి ఉపాధి చూపాలన్నారు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనత ఎక్కువగా ఉంటుంది కాబట్టి వారికి ప్రభుత్వ పథకాల ద్వారా అందే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఫేస్ యాప్ ద్వారా హాజరు తక్కువగా ఉందని, ప్రతి ఒక్కరూ ఫేస్ యాప్‌లో హాజరు వేసేలా చూడాలన్నారు. సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, విద్యా, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎం కప్ జిల్లా ఖోఖో జట్ల ఎంపిక



జిల్లా జట్టుతో జెడ్పీటీసీ, సర్పంచ్, అధికారులు

కనిగిరి రూరల్: సీఎం కప్‌లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్ల ఎంపిక టోర్నమెంట్ శుక్రవారం మండలంలోని కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. మొత్తం ఆరు నియోజకవర్గాల చెందిన బాల, బాలికలు 70 మంది పాల్గొన్నారు. ఎంపిక పోటీల్లో కనిగిరి నియోజకవర్గ క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించగా, సంతనూతలపాడు ద్వితీయస్థానం, అద్దంకి నియోజకవర్గం తృతీయ స్థానం సాధించినట్లు ఖోఖో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి, పీడీ బి.కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. అనంతరం హెచ్‌ఎం డీఆర్ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సర్పంచ్ పోతు రమణారెడ్డిలు మాట్లాడుతూ క్రీడల్లో విజయమే లక్ష్యంగా, ఐక్యతగా పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పీడీ కాశీవిశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి రెండో వారంలో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు పాల్గొంటుందన్నారు. పీఈటీలు హజరత్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, నాయకులు శ్రీహరిరెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టు.. ఎం దివ్యశ్రీ, హేమావతి, డి శివ, నాగలక్ష్మి, బి.శిరీషా, రమ్య, అఖిల, వి.సోనియా, టి.అహల్యా, యు నాగమల్లేశ్వరి, ఎస్ అనురాధ, జి.భవానీ, టి.సుస్మిత, పి.నందిని, పి.సావిత్రమ్మలు జట్టులో ఆడనున్నారు. కోచ్‌గా శ్రీనివాసులరెడ్డి, మేనేజర్‌గా సావిత్రమ్మ ఉంటారన్నారు.

గ్రానైట్ ప్రాజెక్టుపై మిశ్రమ స్పందన



ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న జేసీ, అధికారులు

పీసీపల్లి: మండల పరిధిలోని ముద్దపాడు పరిసర ప్రాంతాల్లో సర్వే నం 111/2 లో 4.83 ఎకరాల్లో తిరుమల సాయి గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ వారు తలపెట్టిన బ్లాక్ గ్రానైట్ మైనింగ్ పరిశ్రమ ఏర్పాటుపై శుక్రవారం జేసీ అభిషిక్త్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రభావిత ప్రాంతమైన ముద్దపాడు, పరిసర గ్రామాల నుంచి ప్రజలు వచ్చి జేసీకి తమ సమస్యలను విన్నవించుకున్నారు. పలువురు గ్రానైట్ పరిశ్రమ ఏర్పాటుతో తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వాకంవారిపల్లి ముద్దపాడులకు చెందిన ఎస్సీలు అసలు గ్రానైట్ ఫ్యాక్టరీ వద్దని, తమ రోడ్లు, ఇళ్లు, బ్లాస్టింగ్‌కి ఉక్కిరిబిక్కిరి అవుతాయన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో వాహనాల రాకపోకలు పెరుగుతాయని, బ్లాస్టింగ్‌తో వాయుకాలుష్యం, శబ్ద కాలుష్యంతో భయాందోళనకు గురికావాల్సి వస్తుందని గ్రామస్తుడు అబ్రహం తెలిపారు. ప్రజల నుంచి ప్రాజెక్టుకు మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కనిగిరి ఆర్డీవో కిడారి సందీప్, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ జి.నాగిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ అధికారులు, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం, ముద్దపాడు సర్పంచ్ రమాదేవి, రాజశేఖర్, కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హనుమంతునిపాడు: మండల పరిధిలో వేములపాడులో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే..అర్ధవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ఎనుమల పోలయ్య కుమారుడు ఎనుమల పోలరాజు (27) అత్త బోగెం ఆదిలక్ష్మి ఇంటికి రెండు రోజుల క్రితం వచ్చాడు. ఈ క్రమంలో భార్య వరలక్ష్మి, అత్త ఆదిలక్ష్మితో గొడవపడి ఫుల్లుగా మద్యం సేవించి ఇంట్లో పడుకున్నాడు. సాయంత్రం భార్య ఎన్నిసార్లు లేపినా లేవకపోవడంతో స్థానికంగా ఆర్‌ఎంపీ వైద్యున్ని పిలిపించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వీరికి మూడేళ్ల క్రితం వివాహం కాగా నిత్యం మద్యం తాగి వచ్చి కొట్టి కొడుతుండటంతో వేములపాడు తల్లి వద్దకు వచ్చి ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణపావని తెలిపారు.

రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- 334 మంది పోలీసులతో బందోబస్తు
- డీఎస్పీ కిషోర్‌కుమార్



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ కేశవరావు

మార్కాపురం టౌన్: పట్టణంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ పి.కేశవరావు, రథసప్త కమిటీ నిర్వాహణ చైర్మన్ వై.కాశీవిశ్వనాథం, ఈఓ జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తిరుమల తరహాలో ఇక్కడ కూడా స్వామికి సప్తవాహన సేవలు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 5.30 నుంచి సూర్య వాహనంతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో సాయంత్రం 5 గంటలకు వెండి రథంపై స్వామి ఊరేగుతారని, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. దాతల సహకారంతో వేలాది మంది భక్తులకు భోజన ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేష్, అర్జునరావు, కొత్తకృష్ణ, నారాయణం రమేష్, రామడుగు రమేష్, వి.రామకృష్ణ, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

334 మందితో బందోబస్తు

రథసప్తమి ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపారు. నలుగురు సీఐలు, 18 మంది ఎస్సైలు, 44 మంది ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 129 మంది కానిస్టేబుళ్లు, 124 మంది హోంగార్డులు, 15 మంది మహిళా కానిస్టేబుళ్లు, 30 మంది స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొంటారని తెలిపారు.

అనధికార వెంచర్లకు షాక్..!

- అనుమతి లేని వెంచర్లలో రిజిస్ట్రేషన్ నిలిపివేతకు డీటీసీపీకి కమిషనర్ నివేదిక
- 13 సర్వే నంబర్లలో 74.86 ఎకరాలు
- నాలుగు రోజుల్లో సబ్ రిజిస్ట్రార్‌కు రానున్న ఆదేశాలు
- వివరాలు వెల్లడించిన కమిషనర్ నారాయణరావు



డీవీఎస్ నారాయణరావు కమిషనర్

కనిగిరి రూరల్: అనుమతి లేకుండా వేసిన అనధికార వెంచర్లపై చర్యలకు కనిగిరి మున్సిపల్ అధికారులు తీసుకున్న నిర్ణయంతో రియల్టర్లకు భారీ షాక్ తగిలింది. ఈ నెల 18న మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్ శాఖకు 13 సర్వే నెంబర్లలోని 74.86 ఎకరాల్లో వేసిన లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేతకు లిఖితపూర్వక నివేదిక ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో కమిషనర్ వివరాలు వెల్లడించారు. పలుమార్లు రియల్టర్లకు హెచ్చరికలు జారీ చేసినా, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినా పట్టించుకోకుండా యధావిధిగా అనధిక వెంచర్లు వేస్తుండటంతో కఠిన చర్యలకు ఉపేక్షించినట్లు తెలిపారు. పట్టా భూముల్లో కనిగిరి మున్సిపాలిటీలో పరిధిలో వేసిన అనధికార, అక్రమ వెంచర్లను అధికారుల బృందం పరిశీలించారు. ఈమేరకు వీఆర్వోల నివేదిక ప్రకారం అనధికార లే అవుట్ల జాబితాను సిద్ధం చేశామన్నారు. తరచూ వెంచర్లలో రాళ్లు తొలగించేందుకు మున్సిపల్ నిధులు వృథా కాకుండా తుది చర్యగా పట్టా భూమిలో వేసిన అనధికార వెంచర్లలో ప్లాట్ల కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని డీటీసీపీకి నివేదికిచ్చామన్నారు. మంగళవారం నాటికి కనిగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రానున్నట్లు వెల్లడించారు. ఈ సర్వే నంబర్లకు సంబంధించి టీపీఓ వద్ద సమగ్ర నివేదికలున్నాయని తెలిపారు.

నేడు అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలు

దొనకొండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 66వ ఎస్‌జీఎఫ్ ఏపీ అంతర్ జిల్లా హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పాల్గొని ప్రారంభిస్తారు. ముఖ్య అతిథులుగా మంత్రులు ఆర్‌కే రోజా, ఆదిమూలపు సురేష్, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొంటారన్నారు. విజేతలకు బహుమతులు అందజేసి నేషనల్ స్థాయి ఆట పోటీలకు పంపిస్తామని ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు తెలిపారు.